
# దెయ్యాల కొంప

అంగర కృష్ణమోహనరావు



హుషారుగా సిటిల్ వేసుకొంటూ రూంలో ప్రవేశించిన కోదండం అట్టే నిర్ఘాంతపడి పోయి లేచేడు—ఒక మంచం మీప్రదాసు మొఖం మీది వరకూ ముసుగు పెట్టుకొని పడుకొని ఉన్నాడు. మరో మంచంమీద గోడకు జారగిలబడి కూర్చుని శూన్యంలోకి చూస్తూ భావకవిలా, గాలిలోని సూక్ష్మజీవుల్ని లెక్కపెడుతున్నాడు వాసు. కుర్చీలో కూర్చుని కాళ్ళు టేబిలు మీద ఉత్తర దక్షిణాలకు పారవేసి తలవెనక్కు వేలాడేసి, ఇంటి యజమాని క్రొత్తగా నేయించిన పై కప్పులోని వెదురు బద్దల్ని లెక్కపెడుతున్నాడు అబ్బా.

ఈ ఫోజులన్నీ చూసేసరికి కోదండానికి పిచ్చెత్తింది. చేతిలో ఉన్న టెన్నిస్ రాకెట్‌ని టేబిలు మీదికి విసురుగా విసిరి, చేతులు వీలైనంత గట్టిగా దులుపుకొంటూ ''ఒరే అబ్బా! ఏం జరిగిందిరా ?'' అన్నాడు అబ్బు భుజం మీద చేతుల్ని ఘట్టిగా కుదేపి. ఊహూ. చలనం లేదు.

''యూ ఫూల్! మాట్లాడవేం రా'' అంటూ రెండు కాళ్ళనూ దగ్గరకు తీసుకు వచ్చి, ఏదుపంది ముళ్ళను ధిక్కరించే జుట్టును పట్టుకొని తల సరిగా ఉంచబోయేడు. కాని అవి యథాస్థానం లోకి పోయినవి.

‘‘డామిట్. మాట్లాడ రా.’’ అంటూ చేతికి లంటిన అరబాటిల్ ‘బ్రిలియంటైన్’ నూ, తుడుచుకొంటున్న తమాలులో మొహం మీద మోదసాగాడు. నెమ్మదిగా చలనం కలిగింది.

‘‘ఒరేయ్ కోదండం ఎలా రా?. . . . .’’

‘‘ఏమిటి ఎలా ? సరిగా చెప్పనోయ్’’

‘‘మనం ఈ పోర్షన్ ఖాళీ చేసి వెళ్ళిపోవటం తప్పదు ఈ సారి.’’

‘‘ఎదేం ?’’

‘‘క్రితంసారి మనల్ని ఇల్లు ఖాళీచేసెయ్యమని ఓనర్ అంటే, మూడు నెలలనోటీస్ డిమాండ్ చేసాం జ్ఞాపకంలా ? ఆ గడువు కాస్తా రేపు ఒకటితోక్లోజ్. ఇందాక ఓనర్ వచ్చి ఆ విషయం జ్ఞాపకం చేసేవరకు మనం ఆ నోటీస్ అందు కొన్నట్లే జ్ఞాపకం లేదు ఎవరికీ.’’ దీర్ఘోపన్యాసాన్ని ముగించి ఆయాసపడసాగాడు అబ్బాయి.

‘‘ఆ పాయింటే. ఈసారి ఏమి వెతుకుదాం? గోడ వారగా ఉన్న కూజాలోని నీరు గ్లాసులో వంపుకుని గడగడ త్రాగేసి కుర్చీలో కూలబడ్డాడు కోదండం. ‘‘ఓ పనిచేద్దాం. మరో పది రూపాయలు ఎక్కువ ఇస్తామని చెప్పితేసరి అతనే వప్పుకుంటాడు.’’, జేబులోంచి సిగరెట్ ప్యాకెట్ తీసి, ఓ సిగరెట్ వెలిగిస్తూ అన్నాడు.

‘‘నాయనా ఆ ఛాన్సు కూడా దాటిపోయింది. కోదండం చేతిలోని బర్కిలీ పేకెట్ అందుకొని ఓ సిగరెట్ నోట్లో పెట్టుకున్నాడు అబ్బాయి. ‘‘వాళ్ళ అబ్బాయికి ఇక్కడికి ట్రాన్స్‌ఫర్ అయిందిట. రేపు ఫస్టున ఇక్కడికి వస్తాడట ఫేమిలీతో. ఖాళీచేయడం తప్పదని ఓండ్రపెట్టాడు ఓనర్ గాడు. పదిహేను ఎక్కువ ఇస్తాం అన్నాడు కూడా దాసు. సిగరెట్ పేకెట్ టేబిల్‌మీదికి విసిరేడు.

‘‘అయితే ఇప్పుడేం చేయటం ?’’ సిగరెట్‌ను నుసిదులుపుతూ అన్నాడు కోదండం.

‘‘అందుకే ఈ ఫోజులన్నీ. ఇందాకటినుండీ ఆలోచిస్తున్నాం, నువ్వు వచ్చేలోపున తేల్చిపారేద్దామని. కానీ తెగిచావటం లేదు . . . ఒరేయ్ వాసూ, నువ్వుకూడా ఆ ఆలోచన మానేసి ఫ్లాష్ అయిన అమోఘమైన అయిడియా ఏదైనా ఉంటే చెప్పరా ఇక’’ అన్నాడు ముసుగుతీసి అవతల పారేసి మంచం మీద కూర్చుంటూ దాసు. ‘‘ఏదా సిగరెట్ పెట్టి ఇలా పారెయ్!’’

‘‘ఇదోవట్టి. సిగరెట్స్ కాల్చుకొనేవాళ్ళు ప్రక్కనున్న వాడిమీదపడి వాడిని ఆర్పేసే బదులు, సొంతంగా కొనుక్కోవటం ఇన్‌డిగ్నిటీ అనుకొంటారు కాబోలు.’’ సిగరెట్‌పెట్టె అందిస్తూ అన్నాడు.

‘‘లేదురా నాయనా. మావన్నీ అయిపోయినయి. బయటనుండి వచ్చేవు కాబట్టి నీకే డిమాండ్.’’

‘‘సర్లే ఇంతకీ అసలు విషయం ఏం చేద్దాం ? అన్నాడు వాసు.

‘ఒరేయ్. ఓపని చేద్దాం. హాస్టల్లో ఏమైనా . . .’’ అబ్బాయి అయిడియాను మధ్యలోనే అందుకొన్నాడు దాసు. ‘‘హాస్టల్ వార్డెన్‌గా ఎకనామిక్స్ చీఫ్ ఆరేస్సెమ్( ఆర్. ఎస్. ఎమ్ ) ఉన్నంత వరకూ అలాంటి ఆశలు మనకి కలలోకి కూడా రాకూడదు. నాకూ నాకూ హాస్టల్లో—ఖాళీ అంటూ ఉన్నా—సీటిస్తాడా ?’’

‘‘ఏదైనా లాడ్జింగ్. . .’’ నసిగేడు, వాసూ.

‘‘మనది లాడ్జింగ్స్‌లోనూ, హాస్టల్స్‌లోనూ ఉండేంత కుదురైన పుట్టుక కాదు. అయినా సంవత్సరం మధ్యలో ఏలాడ్జింగ్ దొరుకుతుంది’’ అన్నాడు, దాసు తిరిగి.

‘‘అందర్నీ ఖండిస్తున్నావ్, నీ అమోఘమైన అయిడియా చెప్పిచావవోయ్’’ అన్నాడు కోదండం.

‘‘నా బుర్ర అంతగట్టిదీ ఎందుకవుతుందిరా. నామెదడే శరణ్యం. ఈ సమస్యను తెంచే పాపం నువ్వే ఒడిగట్టు.’’ అన్నాడు దాసు సిగరెట్ నోట్లోంచి తీసి పొగవదులుస్తూ.

సిగరెట్ నోట్లోపెట్టుకుని నోటి ఇవతలి చివరిగుండా సన్నగా పొగవదులుస్తూ జాగ్రత్తగా అన్నాడు కోదండం, ‘‘నేను నామటుకు ప్రత్యేకంగా ఇచ్చే అయిడియా అంటూ ఏంలేదు గానీ, వేరే పోర్షన్ కోసం ప్రయత్నించడమే, ఫలితం ఎలా ఉన్నా. ఈ అక్టోబరు నెలలో ఇళ్ళుదొరకడం కష్టమే అయినా, ప్రయత్నించడం తప్ప మరేం చేయగలం. కాబట్టి వూరిమీదికి దండయాత్ర చేసి. . .’’ ఆగి నోట్లోని సిగరెట్ బయటికి తీసి దట్టమైన పొగమేఘాన్నోదాన్ని సృష్టించాడు’’. . .ఎంత అద్దెకయినాసరే ఓ ‘పోర్షన్’, లేక ఓ ‘గ్గ’ ది, కనీసం కారు‘షె’డ్డు లాటిదే దయినా గాలం వేసి. . .పట్టాలి. అంతకు మించి ఎవరయినా ఏదైనా చేద్దామంటే సంతోషం’’. కోదండం ఆగి అందరి మొహాల్లోకి చూసేడు.

‘‘రైట్ అంతకుమించి ఇంకేం చేస్తాం కాబట్టే ఈ రెండు రోజుల్లోగా నలుగురం బయలుదేరి, నాలుగు మూలలా విస్తరిల్లి ఉన్న ఓ ‘పే..పే..ద్ద’ మర్రిచెట్టు చూసుకొని, నలుగురం నాలుగు కొమ్మల మీంచిపోయి ఎవరుచేరిన రాజ్యంలో మనకు కావలసిన బంగారు భవనం దొరుకుతుందో చూడాలి. రెండోరోజు సాయంత్రం పూర్తయ్యేసరికి అంతా కలుసుకోవాలి.’’ తన ప్రతిపాదనను బయటపెట్టేడు వాసూ.

‘‘. . .మరేం మేష్టారూ నాదో చిన్న అనుమానమండీ. ఎవరయినా రాజకుమార్తెలు కూడా దొరికితే తెచ్చుకోవచ్చా—అదికూడా సెలవియ్యండి.’’ ఇకిలిస్తూ అన్నాడు దాసు, సిగరెట్‌ని బొటనవ్రేలూ, చూపుడువేళ్ళ మధ్య ఉంచి ఎడమచేత్తో గుండ్రంగా త్రిప్పుతూ.

‘‘నోరు ముయ్యండోయ్. జరగవలసిందేదో చూడండ్రా అంటే కాశీమజిలీలు మొదలుపెట్టేరు, మర్రిచెట్లూ, రాజకుమార్తెలు అంటూ’’ అదిలించేడు కోదండం.

‘‘కీడెంచి మేలెంచమన్నారు పెద్దలు—ఏమీ దొరక్కపోతే ఏం చేద్దాం రా ?’’ సందేహం బయటపెట్టేడు అబ్బాయి చల్లగా.

‘‘అప్పుడూ—నాయనా! చూడూ — మనం కాలేజీకి వెళ్ళేదారిలోలేవూ. . .సువిశాలమైన వృక్షరాజాలు. వాటినీడలో ప్రకృతి మాత ఒడిలో చాలా చల్లగా ఉంటుంది. . .ఫూల్! కీడెంచి మేలు ఎంచమన్నారట. ఆ పెద్దలే పెనుమానం అనుభూతం. . .సారీ. . .అనుమానం పెనుభూతం అనికూడా అన్నారట. సవ్‌రేష్!’’ ఒక్కసారి ఉరిమేడు దాసు.

• • •

మరునాడంతా ఇళ్ళవేటకు బయలు దేరారు. కాలేజీ మానేసి, ఎక్కడా ఏది ఖాళీగా ఉందాలని వెతుక్కొంటూ. రాత్రికి అంతా తిరిగి తమ గృహ రాజానికి చేరుకున్నారు.

‘‘ఎవరి రాజ్యంలోనయినా ఓ పోర్షన్ దొరికిందాండీ ?’ అన్నాడు కోదండం హేళనగా.

‘‘ఉహూ’’ అందరూ తలలు అడ్డంగా వూపేరు.

‘‘పోనీ రాజకుమార్తెలో?’’

‘‘ఉహూ’’

‘‘ఊం కబుర్లు చెప్పమంటే చెబుతారు. సామాన్లు సర్దండి. తెల్లవారగానే ఈపోర్షన్ ఖాళీచేసి శుభ్రమైన చక్కని ఇంట్లో ప్రవేశం చేద్దాం.’’ అన్నాడు కోదండం.

మధ్యలోనే ప్రశ్నలతాలూకు వర్షం కురిసింది.

‘‘ఎక్కడా? ఏ వీధిలో?’’

‘‘అద్దె ఎంత?’’

‘‘రూమా? పోర్షనా?’’

‘‘టాప్, ఎలక్ట్రిసిటీ అన్నీ ఉన్నాయా?’’

‘‘ఆగండి. ఆగండి. అన్నీచెప్తా. సావధాన ‘చిత్తు’లై వినుడు. చిన్న శుభ్రమైన పెంకుటిల్లు, టాప్, ఎలక్ట్రిసిటీ సమస్త సౌకర్యాలూ ఉన్నాయి. చుట్టూ చిన్న గార్డెన్‌లా మొక్కలూ చెట్లూ ఉన్నాయి. అద్దె డెడ్ చీప్. పది రూపాయలు మాత్రమే. ఇల్లంతా మనదే.’’

‘‘బ్యూటిఫుల్.’’

‘‘వండ్రఫుల్.’’

‘‘సూపర్‌ఫైన్.’’

‘‘ ...... ’’

ఇది కాంప్లిమెంట్ల తుఫాను.

ధారాపాతంగా కురుస్తున్న కాంప్లిమెంట్లకు గొడుగుపడుతూ, ‘‘ఆగండి ఆగండి. చిన్న ఎమెండ్‌మెంట్. అన్నీ ఉన్నాయిగాని ఓ చిన్న డిఫెక్ట్ ఆఇంట్లో ఏడెనిమిది నెల్లనుంచీ ఎవరూ ఉండటంలేదు. దాన్లో ఓ దెయ్యముందని ప్రతీతి.

‘‘దట్సాల్. అయినా ఫర్వాలే.’’

‘‘ఆ! దెయ్యాలకొంపే. మైగాడ్.’’ మంచం మీద వెల్లకిలా పడ్డాడు అబ్బాయి, దెయ్యం ఆకారాన్ని వూహాలోకంలో చూస్తూ.

‘‘ఆ! చూస్తూ చూస్తూ ఆదెయ్యాల

కొంపలో మాత్రం నేనడుగు పెట్టను.'' కుర్చీలో చిర్రుబిగిసేడు వాసు గాలిలో దెయ్యాన్ని వెతుకుతూ.

''ఇంతకీ దెయ్యాలకొంప వెతికేవేంరా? ఎక్కడుందదీ?'' తాపీగా ప్రశ్నించేడు దాసు ఓ గ్లాసుడు నీళ్ళు మాత్రం త్రాగి.

''దానవాయిపేట పార్కు వెనుక వీధిలో చివరి ఇల్లు. ఆ సందు అక్కడితో ఆఖరు. చివర ఈఇల్లు కొద్దిగా వేరుగా ఉంది. దాని తరువాత వీరేశలింగం తోట ......''

''బాబోయ్! వీరేశలింగంతోట. పేపెద్ద చింతచెట్లు. దెయ్యాల ఫేవరిట్ చెట్లు.'' దడదడలాడసాగేడు అబ్బూ, కోదండం మాటను మధ్యలోనే త్రుంచేస్తూ.

''అదంతా నాకనవసరం అబ్బూ. సర్వసౌకర్యాలూ ఉన్న ఇల్లు కనీసం ఏభై రూపాయలైనా అద్దెవచ్చే ఇల్లుఏదోమన అదృష్టవశాత్తూ పది రూపాయలకి దొరుకుతుంది. ఏది ఏమైనా నేనా ఇంట్లోకి వెళ్ళిపోవటం ఖాయం. ఒకటో తారీఖు తెల్లవారేసరికి ఓనర్ మిమ్మల్ని రెక్కట్టుకు లాక్కెళ్ళి వీధిలో నుంచో బెడతాడు. చెంబూతప్పేలా అవతలికి విసిరేసి. ఇప్పుడా ఇంట్లోకి దయ్యాలకొంపో ఏదో ఓకొంపలోకి మారక చేసేదేమీ లేదు. ఇష్టమైనవాళ్ళు నాకూడా రావచ్చు. కష్టమైన వాళ్ళు మానేయొచ్చు. తెల్లవారే లోపున ఏసంగతీ నిర్ణయించుకోండి.'' ఆయాసంగా ఆపేడు లెక్చర్ని.

''నేను నీకూడా వచ్చేస్తాన్రా.'' అన్నాడు దాసు.

''దట్స్ ఫైన్. వాళ్ళిద్దరి దారి వాళ్ళు వెతుక్కుంటారు.''

''అలా అంటే ఎలారా?'' ''బిక్కమొగాలు వేసేరు వాసూ, అబ్బూలు.

''లేకపోతే ఏమిట్రా. మీఇద్దరివే ప్రాణాలు. నాపికావు అంతేనా? ఆమాటకొస్తే మీప్రాణాల కన్న నాప్రాణాలే ఎక్కువ. నేను మాఅమ్మకి ఒక్కన్నే పుత్రుణ్ణి. నేలేకపోతే ఆ అస్తంతా కరిగించేవాళ్ళు లేక గడ్డకట్టుకుపోద్ది. మీకేం అన్నలో తమ్ముల్లో ఏడిచారు. మీరు చచ్చినా ఫర్వాలేదు.'' గట్టిగావూపిరి పీల్చిఆగేడు కోదండం.

''ఒబ్బూ ఇంత లావుని ఒల్లుండగానే సరిగాదురా —ఓయ్— దానికిరగ్గ 'దిల్' ఉండాలి. తెల్సిందా ఆ దెయ్యాలు మనల్నేం చేస్తాయి. మనమే వాటిని మించిన పెద్దదయ్యాలం .... సారీ బ్రదర్స్. ఆమె అహ్వానిస్తోంది. చెప్పినమాట వినకపోతే బాధ పడుతుంది. గుడ్ నైట్.''

''ఎవరూ?'' మెడ బార్లసాచి చుట్టూ చూసేడు అబ్బూ, ఆ ఆహ్వానించే 'ఆవిడ' కోసం.

''ఆవిడేనోయ్. మిస్ నిద్రాదేవి.'' అన్నాడు కోదండం.

''ఎవరూ నిర్మలాదేవా?'' అన్నాడు వాసు.

''కాదు పిశాచామోహినీదేవి.'', అంటూ మంచం మీద వాలేడు కోదండం.

తెల్లవారుఝామున ఏడుగంటలకే లేచి అందరూ సామాన్లు సర్దుకోసాగారు, అబ్బూ వాసూలతో సహా.

''ఓరేయ్ కోదండం, నేను గానీ ఆదెయ్యం చేతిలో చచ్చిపోవటం సంభవిస్తే మాఇంటికో టెలిగ్రాం ఇయ్యరా మర్చిపోక'' — అన్నాడు అబ్బూ బిక్కమొగంతో.

''ఆహ, మహా చచ్చేవులేవోయ్. పెద్ద మొనగాడు బయలుదేరాడు చావటానిక్కి కంకణం కట్టుకొని. అయినా నీలాంటివాడూ, నాలాంటివాడూ ఒకడు చస్తే ఇండియా ఫ్యూచర్ పాప్యులేషన్లో ఓ అరడజను మంది తగ్గుతారు. చాలడూ— బ్రహ్మాండమైన దేశసేవ. అంతకన్నానా?'' అన్నాడు కోదండం.

వాళ్ళు ఆఇల్లు ఖాళీచేసి వెళ్ళి పోతూంటే వీధిలోని వాళ్ళు మీటింగు, టీ పార్టీ ఏర్పాటుచేసి ఫేర్‌వెల్ ఇవ్వలేదు గానీ, చాలా మంది సంతోషించేరు వాళ్ళ నిష్క్రమణకు.

ఆరోజంతా సామాన్లు సర్దుకోవటంతోనే సరిపోయింది. తాత్కాలికంగా అందరి సామానూ ఒక్కగదిలోనే ఉంచుకుని కొన్నాళ్ళదాకా ఆ ఒక్క గదిని మాత్రమే వాడుకొనేలా నిశ్చయించుకొన్నారు. గది మధ్యగా ఒకదానిప్రక్క ఒకటి నాలుగు మంచాలూ వేసుకొన్నారు. ఇక ఆ దయ్యం బారినుండి తప్పించుకోడానిక్కి కొన్ని నిబంధనలు తయారుచేసుకొన్నారు. రాత్రి 7 గంటలకే అందరూ భోజనాలూ అవీ కానిచ్చి పడుకోవాలనీ, (పరీక్షలు మార్చిలో కాబట్టి జనవరిలో చదువు మొదలుపెట్టవచ్చు), ఏ పరిస్థితిలోనూ తెల్లవారిందాకా కదలకూడదనీ, సినిమాలు సెకండ్ షోలూ, ఫస్ట్‌షోలూ కట్టిపెట్టి మ్యాటినీలే చూడాలనీ (కావలిస్తే కాలేజీ మానేసయినాసరే) —ఇలాంటి నిబంధనలు చాలా ఉన్నాయి.

ఆ రాత్రి ఏడుకాకుండానే భోజనాలు ముగించి మంచాలమీద చేరేరు మిత్రబృందం.

''ఒరేయ్ కోదండం. దెయ్యాలు ఏ రూపంలో కావలిస్తే ఆ రూపంలో సంచరించగలవటకదరా.'' అన్నాడు అబ్బూ కాసేపటి తర్వాత, గోడమీద ఉన్న బల్లివంక భయం భయంగా చూస్తూ.

''నీమొఖం నోర్మూయ్యవోయ్'' గసిరేడు దాసు.

మరికొన్ని నిముషాలు ధూమపానంలో నిశ్శబ్దంగా గడిచింది.

''ఒరేయ్ కోదండం. అసలింతకీ ఇంట్లో దెయ్యం ఎలా ప్రవేశించిందో తెల్సుకున్నావా.'' అడిగేడు దాసు, గాలిలో పెద్దపెద్దవిగా సాగుతూన్న పొగరింగులకేసి చూస్తూ.

'ఆ. అంతా హంబక్. ఎవరో ఓ పదహారేళ్ళ కన్నెపడుచు ఉరిపోసుకు చచ్చిందట ఆ మూల గదిలో. అందుకే ఆగదికూడా ఎందుకని తాళం పెట్టేసా. ప్రపంచంలో రోజూ ఎందరు చావటం లేదు. దానికే పెద్దహంగామా చేసి ఈ ఇంట్లో దెయ్యం ఉందని అంతా నమ్మేసారు. రాత్రులు ఏవో శబ్దాలూ అవీ అవుతాయట — లది చూద్దాంగా ....''

కోదండం వాక్యాలు ముగించకుండానే మధ్యలో మొదలెట్టేడు 'అబ్బూ' శోకాలు పెయడం. 'అయ్యోయ్! బాబోయ్! నాప్రాణం నిలుపునా పేసేస్తున్నారు. దెయ్యాలు ... శబ్దాలు .. నాయనోయ్. ఎందుకొచ్చిన చదువురా ఇది భగవంతుడా! ప్రాణాలుంటే పచ్చకాగితాలు తిని బ్రతకొచ్చట....'' ఏడ్పు మధ్యలో ఒక సందేహం వచ్చింది. ఏడ్పు ఆపేసి అదికాస్తా బయట పెట్టేడు. ''ఇంతకీ దెయ్యాలలో ఆడా, మొగా ఉంటాయిరా? ఐమీన్, ఆడవాళ్ళు చస్తే ఆడ దెయ్యాలూ. ఎట్‌సెటరా .... ఎట్సెట్రా?' బలవంతాన కోర్కెలతో చచ్చిన ఆడవాళ్ళు మోహినీ పిశాచాలై రాత్రులు మనలాంటి .... మధ్యలోనే ఆపి, ''గుటుక్.. ... గుటుక్'' మని గాలి మ్రింగసాగాడు వాసూ.

''ఛత్ ... మోహినీ పిశాచీలేదు, నీ మొహం పిశాచీ లేదు, మీా రెక్కడుంనా డిగ్రీక్లాస్ స్టూడెంట్సేనటరా ? ఇలా ఒకటోక్లాసు పిల్లలు లాగా దెయ్యాలూ, బయ్యాలూ అంటూ. ఛీ ఛీ! కసిరేడు కోదండం.

''ఒరేయ్! ఒరేయ్! నీకు పుణ్యముంటుంది గట్టిగా తిట్టకురా. ఆ దెయ్యం కాస్త వింటంటే కోపం వస్తుంది.'' గాలిలోకి చూస్తూ లెంపలేసుకున్నాడు అబ్బూ! ''ఇంతకీ ఆ దెయ్యాలనేవి ఉన్నాయా ? అదంతా మన భ్రమేనా ?'' నెమ్మదిగా గొణిగాడు దాసు.

''దాసూ! అనవసరంగా దయ్యాలూభూతాలూ అని మనం భయపడటమేకానీ, ఈ మ్యాట్రిక్ ఏజ్‌లో ఇంకా దెయ్యాలేమిట్రా ? నీ పిచ్చిగానీ'' అన్నాడు కోదండం.

''మొన్న ఏదో సైంటిఫిక్ జర్నల్‌లోచదివాను దెయ్యాలనేవి ఓ విధమయిన ఛాయలనీ, వెల్తురు పడితే ఆ నీడలు చెదిరిపోతాయనీ, సైంటిస్టు వ్రాసాడు. కాబట్టి రేపట్నుంచీ మన గదిలో ఓ హండ్రడ్ వాట్స్‌బల్బ్ పెట్టుకుందాం.'' తన ఐడియా వెల్లడించాడు వాసు.

ఇంక అక్కడి నుంచి దెయ్యాలున్నాయా? లేవా అనే విషయంమీద కాట్లకుక్కల్లా కొట్టుకున్నారు నలుగురూ కాసేపు. సప్రమాణ పూర్వకంగా — మా తాతయ్య ఓ మాటు దెయ్యంతో దెబ్బలాడాడనీ, మాఅమ్మమ్మ ఓ కొరివి దెయ్యాన్ని చూసిందనీ, మా ఇంటి పక్కాయనన్ను మోహినీ పిశాచం చాలారోజులు పీడించిందనీ — ఇలా సాగిపోయిందా చర్చ.

ఇంతలో అబ్బూ సడన్‌గా జ్ఞాపకం చేశాడు. ''ఒరేయ్! మనం ఉన్నది దెయ్యాల కొంపలో. టైమా పావుతక్కువ పన్నెండు. ఇదా దెయ్యాల గురించి దెబ్బలాడే సమయం. '' అని. దాంతో అందరినోళ్ళూ బంద్ అయినాయి.

ఎందుకో అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది అబ్బూకి. శరీరాన్ని ఏ మాత్రం కదల్చకుండా



## కాశీ హిందూ విశ్వ విద్యాలయం ఆంధ్ర సమితి ప్రదర్శించిన 'పీలి అంచు సిగరెట్' నాటికలో పాల్గొన్న నటీ నటులు

జాగ్రత్తగా తలను మాత్రం ప్రక్కకు త్రిప్పి, టేబుల్ వంక చూశాడు. టైంపీస్‌లోని రేడియం డయల్‌లో రెండుముళ్ళూ వంటిగంట దగ్గర మెరుస్తున్నాయి. "గుయ్ ... య్ ... య్...' ఏదో ఝుంకారం చేస్తున్నట్లు వినిపించసాగింది. మరుక్షణంలో వేసివున్న గది తలుపులమీద ఎవరో తట్టుతున్న చప్పుడు. "ధన్ ... ధన్ ... — "ధన్ .... ధన్" ముచ్చెమట్లు పట్టినయ్ అబ్బూ శరీరం నిండా. అంత చలి వేస్తున్నాకూడా ప్రాణవాయువులు అనంత వాయువుల్లో కలసిపోబోయి, భయంవేసి తిరిగిశరీరంలోనే ఆగిపోయినయ్. " సందేహం లేదు, ఇవి ఆ దెయ్యం చేసే శబ్దాలే" అలాగే ప్రాణాలుబిగపట్టుకుని చావడంకన్నా ప్రక్కనున్న దాసును లేపటం సుఖంగా తోచింది. మెల్లగా ప్రక్కమంచం మీదవున్న దాసుని తట్టాడు. "ఒరేయ్! ఆ శబ్దాలు వినరా!" నెమ్మదిగా గొణిగాడు అబ్బూ. "ధన్ ... ధన్... "ధన్ ... ధన్"

"ఎవరో తలుపు తడుతున్నారు తీసి వస్తానుండు" నిద్రమత్తులో ఆవలిస్తూ మంచం దిగబోయాడు దాసు.

"ఉష్! వెళ్ళకురా ! బయట తలుపు వేసివుంటే మన తలుపు దగ్గర కెవరో ఎలా వస్తార్రా! ఆ శబ్దాలు దెయ్యం చేసేవిరా." బిగ్గరగా గొణిగాడు అబ్బూ.

"అవున్రోయ్!" నిద్రమత్తు వదలి మెదడు పనిచేయసాగింది. వెంటనేమిగిలినయిద్దరూ కూడా లేపబడ్డారు. "గుయ్ మనే శబ్దం, తలుపు తట్టిన శబ్దం వినిపిస్తూనే వున్నాయి,

"అయితే, దెయ్యమేపనిగట్టుకుని తీరుబడిగా ఆ శబ్దాలు చేస్తోందా ?' నెమ్మదిగా అన్నాడు కోదండం.

"తప్పకుండా!" ఏకగ్రీవంగా అన్నారు మిగిలిన ముగ్గురూ.

"ఉహూ! దెయ్యాలనేవి ఉంటే ఆ పని చేస్తున్నది ఆ దెయ్యమనే పదార్థమే అయితే, మనం అంతా మెలుకువగా ఉండి, మాట్లాడుకుంటున్నా ఇంకా అక్కడ ఉంటూందా "

తిరిగి"ధన్ ... ధన్" 'ధన్ ... ధన్" ....


"అదేమిట్రా? దెయ్యానికి మనల్ని చూస్తే భయమనుకున్నావా ! తన ప్లేస్‌లోకి అడుగుపెట్టిన మనల్ని భయపెట్టటానికది చూస్తూంటే" అన్నాడు వాసు కీచుగా.

తిరిగి '''గుయ్... య్....య్ ధన్ ...ధన్"

ఈసారి కోదండానికి కూడా మతి పోయింది. నెమ్మదిగా మంచం మీదనుండి లేచి కూర్చున్నాడు. చెవులు రిక్కించుకునిజాగ్రత్తగావిన్నాడు. "దీని అంతేదోచూసేస్తా"గొణిగాడు.వాడుదాంతో ఏం కొత్తరకం తంటా తెచ్చిపెడతాడా అని తారెత్తసాగారు ముగ్గురూ.

"అలా బయట కొట్టుకు చచ్చేబదులు ధైర్యం ఉంటే లోపలకు ఏడవరాదూ! " అన్నట్లుండి గట్టిగా అరిచాడుకోదండం తలుపువంక చూస్తూ. ఇల్లంతా ప్రతిధ్వనించిందా కేక. మిగిలిన ముగ్గురూ అదిరిపోయారు.

శబ్దం ఆగిపోయింది. ఓరగా మూసివున్న కిటికీరెక్క ధడాలున తెరుచుకుని, గోడకు కొట్టు



# లోపలకుదారి.....

## చంద్రశేఖర్...

కుంది. కిటిలోంచి రయ్‌మని శబ్దం వచ్చింది. కిటికీ అంచులోపల ఉన్న గాజుగ్లాసు క్రిందపడి భళ్ళున శబ్దం చేస్తూ పగిలింది. గోడమీద ఉన్న కాలండర్ టపటపా కొట్టుకుని క్రింద పడింది. రివ్వున ఓ గాలితెరవచ్చి నలుగుర్నీ గజగజ లాడించింది.

''శ్రీ ఆంజనేయం ... ప్రసన్నాజనేయం ..'' కష్టపడి కంఠతా పట్టినఆంజనేయదండకం జ్ఞాపకం తెచ్చుకోవడానికి తంటాలు పడ్డాడు అబ్బా.

''బా ... బో ... య్ .. దెయ్యం ..గ గ్గ ది ... లోకి ... వ ... వచ్చేసింది '' కళ్ళు గట్టిగా మూసుకుని వణకసాగాడు వాసూ.

పైన నలభై వాట్సబల్బు వెలుగుతున్న సంగతి మర్చిపోయి అగ్గిపుల్లగీసిచేత్తోపట్టుకుని,చుట్టూ చూసాడు, కోదండం. దగిలోకి వచ్చిన దయ్యం కోసం.

ఒక నిముషంసేపు''అసలు హిచ్‌కాక్ మార్క్ సస్పెన్సు నడిచింది. తిరిగి గది బయట ధన్ ధన్ మనే శబ్దం.

''దయ్యం బయటకు పోయింది'' నెమ్మదిగ అన్నాడు దాసు.

''మళ్ళీ లోపలకు రా చూద్దాం?'' ఆంజనేయ. దండకం పుస్తకం చేతపట్టుకుని ధైర్యం చేసి అన్నాడు వాసూ. మొదటిసారి ఏమీ చేయలేదన్న ధరవాసాకొద్దీ.

శబ్దం ఆగింది, కానీ దెయ్యం గదిలోకి వచ్చిన సూచన లేం లేవు. తిరిగి ''ధన్ ... ధన్'' గుయ్ య్...య్''

నెమ్మదిగా ఒక సిగరెట్ వెలిగించాడుకోదండం. మంచం మీదనుంచి దిగి శబ్దం చెయ్యకుండా టేబుల్ క్రింద ఉన్న చీపురుకట్టను చేత్తో పట్టుకున్నాడు. ఒక్క వూపులోగది తలుపు తెరచి, చేతిలో వున్న చీపురుపకట్టను గాలిలో శక్తికొలది యూడించ,మొదలుపెట్టాడు. మిగిలిన ముగ్గురూ ప్రాణాలు బిగబట్టుకుని చూస్తున్నారు. కోదండం గాలిలో చేసే యుద్ధాన్ని.

గదిలో లైటువెల్తురు వరండాలో పడింది. తలుపు తీయుటంతోనే. అప్పటివరకు గది బయట వున్న పందికొక్కు కోదండం కాళ్ళ మధ్యనుంచి బయటకు గెంతి, గది అవతలి చివరకు పరుగెత్తి ఆ మూలన ఉన్న కన్నంలోకిదూరింది.

''హ .. హ్హ.. హ్హ! దీ గ్రేట్ దయ్యం'' విరగబడి నవ్వాడు కోదండం.

''దెయ్యం పందికొక్కయింది'' గొణిగాడు వాసు నీరసంగా.

''నాన్సెన్ అది దెయ్యం కాదు, రియల్ పందికొక్కే. ఇందాకటినుండీ తలుపు తట్టింది అదే. దాని కన్నం మన గదిగోడలోఉంది. తలుపులు తీసి వున్నప్పుడది ఈ గది అవతలకు విహారానికి వెళ్ళింది. షికారునుండి తిరిగివచ్చేసరికి తలుపుల వేసివున్నాయి. ఈ గదిలోకిఅం టేదీనిగుండా దాని కలుగులోకిపోవడానికి దారిలేక తలుపును ముట్టితో పొడుస్తూంది.మనం కేకలువేసిదెయ్యాన్ని ఛాలంజీ చేసినప్పుడల్లా ఆశబ్దాలకు ఆగేది. ఇప్పుడు తలుపు తీయడం తోనే రాయల్‌గా లోపలకు వచ్చేసింది. ఎలా వుంది?'' మంచం మీద కూర్చున్నాడు కోదండం.

''ఏమో నాకు నమ్మకం లేదు'' అన్నాడు అబ్బా..

''కావాలంటే చూద్దాంగా మళ్ళీ ఏదెయ్యమైనా తలుపు తడుతుందేమో''! లేచి వెళ్ళి తలుపు వేశాడు.

''మరి ఆ గుయ్‌మనే శబ్దమో'' అన్నాడు వాసు. ఆశబ్దం అలా ఉండి ఉండి వస్తూనే వుంది. లేచి వెళ్ళి టార్చిలైట్ శబ్దం వస్తున్నవైపు ఫోకస్‌చేసి ఓ క్షణం చూసి తిరిగి తలుపు మూసి వచ్చేడు కోదండం.

''ఆశబ్దం మనం తాళం వేసిన గదిపైనున్న అటకమీంచి వస్తోంది. అందుకే ఆశబ్దం దెయ్యం తాలూకుదనుకొన్నారేమో అంతా. ఒక చిన్న ఎక్స్‌పెరిమెంటు చేసి ఇక్కడో చిన్న దెయ్యాన్ని సృష్టించి ఆరెండు దయ్యాలూ ఒకలా ఉన్నాయో లేదో చూద్దాం ఉండు'' అన్నాడు అంతక్రితం క్రిందపడి బద్దలైన గాజు గ్లాసువంక నడుస్తూ.

పగిలిపోయిన మట్టుమ (షేప్) పైకి తీసేడు. ఆ అడుగుకుపైన గ్లాసులో కొంత భాగంకూడా ఉంది. దాని కిటికీ వూచలమధ్య అటు త్రిప్పి అమర్చేడు. ఈమాటు గాలి వీచినప్పుడల్లా ''గుయ్ య్యు...య్యు'' మనే శబ్దం రావడం మొదలు పెట్టింది. ఆగ్లాసు ముక్కను అక్కడే ఉంచి వచ్చేస్తూ, ''చూశారా మన దెయ్యం కూడా అచ్చం అలాగే శబ్దం చేస్తూంది'' అన్నాడు కోదండం.

''మరే. అయితే ఆ అటకమీదిదికూడా 'పగిలిపోయిన గ్లాసుమార్కు' దెయ్యమే నంటావా?'' అనుమానంగా అన్నాడు వాసు.

"పగిలిపోయిన గ్లాసుముక్క, మరేమాం క్ర రేపు చూద్దాంగా. ఆ అటక అటువేపు 'ఓపెన్'గా ఉందిగా. అసలే ఈకొంప వీధి చివర ఉంది, పైగా ప్రక్కన బీళ్లు, తోట అంచేత గాలి తీవ్రంగా వీస్తుంది. అటుకుమీదనున్న మొనలు తేలివున్న ఏవస్తువునో తాకినప్పుడల్లా ఈ ఝుంకారశబ్దం పుడుతూంది, గాలి ఒరిపిడికి పగలు మిగిలి పోయిన శబ్దాలమధ్య ఇదేం సరిగా వినిపించదు. ఇక రాత్రుళు ఇదే భయంకరంగా మారి దెయ్యం అరుపు అవుతూంది" అగాడు కోదండం.

"ఎలా అయినా ఇంటర్‌మీడియట్లో 'సైన్స్ స్టూడెంటువి గదరా!" మెచ్చుకొన్నాడు దాసు.

"ఇదిగో మనవాళ్ళు అనుకునే దెయ్యాలన్నీ ఇలాగే మారుతుంటాయి. ఆ అమ్మాయి బలవంతంగా చచ్చింది. దెయ్యమైందన్నారు. అంతే ఈ పందికొక్కు దెయ్యాలూ, గ్లాసుముక్క దెయ్యాలు....ఇవన్నీ దెయ్యాలక్రిందే జమ. ఇంతకన్న మంచి దెయ్యాని ఒకసారి మా మామయ్య వాళ్ళూపట్టుకొన్నారట....."

"ఏమిటది?" మెడముందుకు సాచేడు అబ్బూ.

"చెప్తాగా. వాళ్ళు ఇంజనీరింగ్ చదివేప్పుడు కాకినాడలో మనలాగే గతిలేకట దెయ్యాల కొంపలో కాపరం పెట్టేరు. మనదెయ్యం ఝుంకారం చేసి తలుపు తడుతుండా, ఆ దెయ్యమేంచేసేదట— ఘల్లు ఘల్లుమని గజ్జెలు కట్టుకొని డాన్స్ చేసేదట. అంటే ఆ ఇంట్లో ఓ బోగంది చచ్చిందట. అదే అలా రాత్రులు తిరిగేదని అంతా అన్నారు. బస్. ఆయింటికి దెయ్యాలకొంప బిరుదు ప్రసాదించి ఆ దెయ్యం గౌరవార్థం ఎవరూ దాన్లో దిగటం మానేసేరు. చవగ్గా పది రూపాయలకి గిట్టిందని మామావయ్య ఓ నలుగురు ఫ్రెండ్స్ దాన్లో దిగేరు. మొదటి రోజు ఆదెయ్యాన్ని విని తారెత్తినా, రెండో రోజు 'లెవెన్‌సెల్స్' టార్చిలైట్లూ అవీ కొని ఆ ఇంట్లోని అటకమీదికి 'రైడ్' బయలుదేరి దెయ్యాన్ని కాస్తా అరెస్ట్ చేసి లాకప్‌లోకి తోసేసేరు......"

"ఎట్లా? ఎట్లా?", మంచం మధ్యకి జరిగిపోయి అన్నాడు అబ్బూ.

"ఆ! ఇంతకీ అది ఏమార్కు దెయ్యమో తెలుసా. అసలైన, సిసలైన గోరువంక దంపతులు ఆ ఇంట్లో ఉండే బోగంది వాటిని మచ్చిక చేసిందట. తన కళాహృదయానికి చిహ్నంగా వాటి మెడల్లో మువ్వలదండలు కట్టిందట. అవి రోజు పగలు ఎక్కడికో పోయి రాత్రులు అటకమీది గూట్లో జేరేవి. ఒకరోజు ఆ బోగంది కాస్తా బ్రహ్మండంగా చచ్చి పూరుకుంది. ఆ ఇంట్లో ఆతర్వాత దిగిన వాళ్ళ పాట్లు దేవునికెరుక. ఒకోరు రావడం రాత్రి శబ్దాలు విని తారెత్తి తెల్లారే సరికి కొంప ఖాళీచేసేయుటం."

"బ్రహ్మండం కదో?" రమణారెడ్డి కంఠాన్ని ఎరువు తెచ్చుకొని పలికేడు వాసు.

"పూర్తిగా విను. మావాళ్ళు ఈ సంగతి తెల్సి కొనిగప్‌చిప్‌గా ఉండాలా? ఊహూ! వాళ్ళు ప్రజలందరూ మెచ్చాలని ఓడప్పు లద్దెకి తెచ్చి మరీ చాటించేరు ఈ సంగతి పేధంతా. ఆఇంటి ఓనరు తన కొంప మీది చెడ్డ రిమార్కు తొలగించినందుకు కృతజ్ఞతగా నలుగురికీ నాలుగు కాఫీలు పోయించి — "ఇప్పుడు నాకొంప దెయ్యాల కొంపకాదు. ఒకటోరకం ఎలక్ట్రిఫైడ్ పెంకుటిల్లు. అద్దె ముప్పై రూపాయలూ. అద్దైన మీకు కాబట్టి. వీరు వెళ్ళిపోతే నలభై వస్తుంది" అన్నాట్ట. చచ్చినట్టు బ్రతిమాలుకుని పాతిక్కి రాజీ పడ్డారట. "ఎలా ఉంది?", పుట్టూ చూసేడు కోదండం.

"ఇది బ్రహ్మండంకన్నా బ్రహ్మండం కదో" తెగ మెచ్చుకున్నాడు వాసు.

"కాబట్టి ఈ ఇంట్లో దయ్యం అనే పదార్థం నిజంగా లేకపోవడం నిజం అయితే అవిషయం వెల్లడి చేయకూడదు. పోగా మనం రోజూ ఆ దెయ్యంతో రాత్రులు హెూరా హెూరీగా కుస్తీ పడుతున్నామని వీలైనంత ఎక్కువగా ప్రచారంచేసి — ఆకష్టానికి ప్రతిఫలంగా అద్దెలోంచి ఓ అయిదు రూపాయలు తగ్గించమని ఇంటి యజమానికి అప్పీల్ చేసుకోవాలి. ఇది పైకథవల్ల మనం నేర్చుకొనవలసిన నీతి. హౌస్వీజిట్?" కాలర్‌పైకెత్తి వూపేడు అబ్బూ.

"ఓ హెూహెూ! హదుబుతం. 'హత్యాశ్చర్యం' మారువెల్లస్", చకచకా కాంప్లిమెంట్స్ కురిపించేడు వాసూ.

తెల్లవారగానే ప్రక్కఇంటివాళ్లని ( మధ్య దూరం ఓవంద గజాలకి తక్కువ ఉండదు ) బ్రతిమాలి నిచ్చెనతెచ్చి అటక ఎక్కాడు కోదండం. ఒక ఐదు నిముషాలసేపు అటకంతా గాలించి, చేతిలో అతుకులు వూడిపోయిన రేకుడబ్బా ఒకటి తీసుకుని క్రిందకు దిగేడు, వంటనిండా బూజుల తోరణాలతోనూ, ఓ అరడజను సాలిపురుగుల తోనూ, రెండు బొద్దింకలతోనూ .... వగైరా వగైరాలతో.

"పాపం ఇంతకుముందుండిన వాళ్ళు అటక మీది దయ్యానికి జడిసి చాలా సామాన్లు వదిలేసి పోయారుపైన .... ఆ ఇంతకీ ఇదిగో మన దెయ్యం .", చేతిలో డబ్బాను నేలకేసి కొడుతూ అన్నాడు.

అబ్బూ దాన్నితీసి చేత్తోపట్టుకుని గాలికి ఎదురుగా పెట్టేడు. పైకిలేచిన రేకు అంచులకు గాలి రాసుకుని "గుయ్ ...య్" మనే శబ్దాన్ని చేస్తూంది, గాలివేగాన్నిబట్టి శబ్దం మారుతూ.

"మరే ఈశబ్దమేలాగుంది"

ఇలాటి అతుకులూడిన దెయ్యాలుపైన చాలా ఉన్నాయి", దాన్ని కాలితో ప్రక్కకి తన్ని కుళాయి వేపు నడిచేడు కోదండం.

"అయితే ఈఇంట్లో దెయ్యాల్లేవా?" సందేహం వచ్చింది వాసూకి.

'చూద్దాం మరే క్రొత్తరకం దెయ్యమైనా పుడుతుందేమో. ముందా పందికొక్కును ఖాని గదిలోంచి తరమాలి" లోపలికి నడిచేడు దాసు.

ఒక వారంరోజులు సవ్యంగా గడిచిపోయినయి. ఇక ఆఇంట్లో ఏలాటి దెయ్యమూ లేదని అందరూ నిశ్చయించేసుకొన్నారు, అబ్బూ సహితంగా. ఇంట్లో దెయ్యం లేదనగానే అబ్బూ, వాసూలకి కూడా ధైర్యం వచ్చింది. ఆ ఇంట్లోని మిగిలిన గదులు మూడింటినీ కూడా ఉపయోగించసాగారు.

ఆరోజు ప్రొద్దుట కాలేజీకి వెళ్ళటానికి తయారవుతున్నారు నలుగురూ. "అసలు నేను మొదటే అనుకొన్నా నన్నుచూసి ఈదెయ్యం పరుగెత్తుతుందని. నేననవసరంగా భయపడ్డా గానీ అసలు నన్ను చూస్తే దెయ్యాలకి భయమన్నమాట మరచేపోయా." — కాళ్ళకు మెష్ నైలాన్‌సాక్సు ఎక్కిస్తూ అన్నాడు అబ్బూ.

"బ్రేవో. చూడండోయ్ వీడి ప్రతాపం. ఈమొహాన్ని చూసి ఆదెయ్యం జడుసుకుందట." అన్నాడు దాసు బూట్‌ని బ్రెష్‌చేస్తూ.

రింగుల్లోకి బెల్ట్ ఎక్కిస్తూన్న వాసూ, ఫాంట్‌ని అలా చేతితో పట్టుకుని తలపైకెత్తి "అంటే నువ్వు గానీ 'ఏంటీ దెయ్యమిక్' మెషిన్ వటరా?", అనేసి బిగ్గరగా నవ్వేసేడు, తనువేసిన జోక్‌కి మిగిలినవాళ్ళు అంత గట్టిగా నవ్వకపోవటం మొహం మాడ్చుకుని ఫాంట్‌లోకి కోపం కొలదీ కాలు విసురుగా ఎక్కించి తూలబోయి మంచం పట్టుకొని ఆగేడు.

"ఆదికాదోయ్. ఒకసారి మాతాతకూడా ఇలాగే ఒక మోహినీపిశాచి పడిందట ... అప్పుడాయన ఏంచేసేడంటే ఒక కొరడా పుచ్చుకొని దాన్ని త్రిప్పిత్రిప్పితన్ని ఓబాటిల్‌లో సీల్ చేసేడట. అంచేతా ఎంతలేదన్నా ఆయన మనవన్నే గాబట్టే ఈదెయ్యం నేనన్నా భయపడిపోయిందన్న మాట. దాసన్నట్టు నేను నిజంగా 'ఏంటీ దెయ్యమిక్' మెషిన్‌నే నన్నమాట, లేకపోతే మనం వచ్చే వరకూ ఈఇంట్లో ఉన్న దెయ్యం పారిపోయిందెందుకు?" టక్ సర్దుకొంటూ అన్నాడు అబ్బూ.

తల దువ్వుకోడం పూర్తిచేసి దువ్వెన టేబిల్ మీద పారేసి, టవల్‌కి చెయ్యితుడుస్తూ అన్నాడు కోదండం. "నువ్వు ఏంటీ దెయ్యమిక్ మెషిన్‌వో ఏంటీ 'ధైర్యమిక్' మెషిన్‌వో వేరే సంగతిగాని ఈదెయ్యం మనకి చాలా ఉపకారం చేసింది. కనిపిస్తే ఒక కొబ్బరికాయు కొట్టి దణ్ణంపెట్టొచ్చు. నవ్వేసి అద్దంలోకి చూస్తూ టక్ సరిచేసుకొన్నాడు.

"ఒకటేమిటి అరడజను కొడతా నాకు కనిపిస్తే— కానీ ఎటుచూసీ వాడగ్గరకవి రావటాన్కి భయపడతాయంటే" అన్నాడు అబ్బూ ఫైల్‌లోకి, బ్రెట్‌హాలిడే 'నేకెడ్‌కార్ప్స్' క్లీవ్ చేస్తూ.

"అవునురా నిజంగా దేవుళ్ళకన్న ఈదెయ్యాలకి కొబ్బరికాయలు కొడితేనయం. ఆంజనేయ

స్వామికి 'పరీక్ష ప్యాసైతే పాతిక కొబ్బరికాయలు కొడతామయ్యా' అన్నా ఫస్ట్‌ఛాన్స్‌లో ప్యాస్ చేయించేపాటి ఉపకారం చేయడు. ఈదెయ్యం మనం అడక్కపోయినా బోల్డు ఉపకారంచేసి పారేసింది. ఈరోజుల్లో దైవారాధనకన్నా దెయ్యారాధనే అచ్చి వచ్చేటట్టుంది." అని ఎవరూ నవ్వకపోతే తనే నవ్వేసేడు వాసు.

ఆవేళరాత్రి 12 గంటలయి ఉంటుంది. "చచ్చాన్రోయ్!" అన్న కేక వినిఅంతా గదుల్లోంచి బయటకు వచ్చేరు. వరండాలోని లైట్ వెలుగుతోంది. లైట్‌స్విచ్ ఉన్న గోడదగ్గర నేలమీద వణుకుతూన్న ఏంటీ దెయ్యమిక్ మెషిన్ కనిపించేడు. అంతా కలిసి అబ్బాని ఎత్తుకువెళ్ళి మంచంమీద పడుకోబెట్టారు. మడతమంచం విరిగిపోయేలా ఎగరటం మొదలుపెట్టేడు. ఏంజరిగిందో ఎవరికీ అర్ధంకాలేదు. ఇంతలో 'అయ్యబాబోయ్! దెయ్యం', అంటూ మంచంమీద ఫుట్‌బాల్‌లా ఎగిరి, కూర్చుని ప్రక్కనే ఉన్న వాసూని గట్టిగా కవుగలించుకొన్నాడు. అబ్బా ఎదురుగా ఉన్న గోడవంక చేత్తో చూపిస్తూ. వాడి అవస్థచూస్తే నవ్వువచ్చింది మిగిలినవాళ్ళకి. ఆగోడవంక చూసేసరికి ముచ్చటగా మూడు రంగుల్లో ఉన్న సినీతార క్యాలండర్ ఉంది అబ్బా చేతికి ఎదురుగా.

"ఏమిట్రా అసలేం జరిగింది. మళ్ళీ ఎక్కడుండి వచ్చింది దెయ్యం", ప్రక్కను కూర్చుని సముదాయించబోయేడు కోదండం.

"అబ్బొ దెయ్యం .... దెయ్యంరా .... నాకు .....నాకు దెయ్యం కనిపించింది. దానిచేత్తో నామొఖంమీద కొట్టింది కూడా.", తిరిగి ఒక్కసారి గజగజలాడేడు అబ్బా.

"మరయితే ప్రొద్దున్న అరడజను కొబ్బరి కాయలు కొడతానన్నావుగా. అందుకే వచ్చిందేమో.", నవ్వేడు దాసు.

"ఛా!దెయ్యమేమిటిరా? ఏపిల్లని చూసేవో", అన్నాడు కోదండం వచ్చేనవ్వును ఆపుకొంటూ.

"మరి పిల్లికి లైట్లువేయటం రాదుగదరా?" వాసూను వదిలి కోదండం చెయ్యి పట్టుకున్నాడు అబ్బా. అప్పటిదాకా అబ్బా కవుగిలిలో నలిగిపోయి ఉక్కిరిబిక్కిరి అయినవాసూ ఎందుకయినా మంచిదని దూరంగా వెళ్ళిపోయి నిలబడ్డాడు.

"లైటేమిటి? ఇంతకీ ఏం జరిగిందో సరిగ్గా ఏడ్వవోయ్. మమ్మల్ని చంపక", విసుక్కున్నాడు కోదండం.

"మరేమో నేను 'లేవెట్రికి' వెళ్ళివస్తున్నాను. వెళ్ళేప్పుడు వరండాలో లైటు ఆర్పేసి వెళ్ళాను. తిరిగి వచ్చేప్పుడు స్విచ్ దగ్గర వరకూ వచ్చి లైట్ వేయబోయేను. నేను చెయ్యి పైకెత్తేలోపునే 'టక్' మని స్విచ్ నొక్కిన శబ్దం, వెంటనే లైట్ వెలిగింది. అదే సమయంలో ఏదో నామొఖంమీద రాచుకుంది. ఇప్పుడు చెప్పు ఈపని పిల్లి చేసిందంటావా? దెయ్యంచేసిందంటావా?", కోదండం భుజాలు పట్టుకుని వూపేసేడు అబ్బా.

"అయితే ఆలైట్ ఎలా వెలిగింది, ఆస్విచ్ ఎవరు నొక్కేరు? ఇదొక్కటే స్విచ్‌గా ఈ లైటుకు?", స్విచ్ తడిమిచూసేడు, కోదండం.

"ఎవరో వెయ్యడమేమిటి? నేను ప్రొద్దున్న తిట్టేనని కోపం వచ్చి ఆదెయ్యమే నన్ను భయపెట్టింది. స్విచ్‌ని నొక్కింది మనిషిగాని, పిల్లిగానీ అయివుంటే, లైటు వెలగ్గానే నాకు కనిపించేవారుగా. స్విచ్ నొక్కడాన్నీ, లైటు వెలగడాన్కి ఒక సెకనయినా తేడాలేదుగా. లైట్ వెలగగానే మొఖంమీద ఏదో తగిలింది, అప్పుడే భయంవేసి క్రిందపడిపోయా. నామాట విను. ఈప్రాణాల్ని రక్షించి పుణ్యంకట్టుకో. ఈఇంట్లో దెయ్యాలున్నాయి. తెల్లారగానే పోదాం ఈకొంపలోంచి.", గమ్మని ముసుగు పెట్టుకుని మంచమీద వాలిపోయేడు అబ్బా. ఆరాత్రంతా అబ్బాని కాపలాకాయటంతో తెల్లవారింది.

తెల్లవారేసరికి జ్వరం వచ్చేసింది అబ్బాకు.

"ఒరేయ్ అబ్బా రాత్రి జరిగిందంతా నేనే చేసేను. ఆలైటువేసింది నేనేరా దెయ్యంకాదు." అన్నాడు దాసు నెమ్మదిగా.

"కాదు. ఆపని చేసింది నువ్వుకాదు. నా మాట విను. దెయ్యం తప్ప నువ్వుగానీ మరెవరు గానీ, ఆపరిస్థితుల్లో నాకు కనిపించకుండా ఆలైట్ వేయలేరు", గొణిగేడు అబ్బా.

"లేదురా బాబూ. ఆపని చేసింది నేనే. ప్రొద్దున్న నువ్వు కోసిన కోతలక్కి ఏడిపించాలని అలాచేసేనుగానీ, నీక్కి ఇలా జ్వరం వస్తుందనుకోలేదు."

"ఏడిసినట్టుంది నీ వెధవ సరసం. అదెలా చేసేవో వాడికి నమ్మకం కలిగేలా చెప్పు. వాడె లాంటి ధైర్యవంతుడో తెల్సివుండీకూడా వాడితోనా ఈ వేళాకోళాలు", అన్నాడు కోదండం.

"అబ్బే వాడింత గొప్ప ధైర్యస్థుడనుకోలేదు! మధ్యాహ్నం వాడి కబుర్లు వింటుంటే వళ్ళు మండింది. వాణ్ణి హడలగొట్టాలనుకొన్నా. రాత్రివాడు లేచి లేవెట్రికి వెళ్ళినప్పుడు నాకూ మెలుకువ వచ్చింది. ఒక నల్లనిదారం తీసుకొని దాని చివర "లూప్" చేసి ఆస్విచ్‌కి తగిలించా. రెండోచివర ప్రక్కనున్న కిటికీగుండా గదిలోకితీసి రెడీగా పట్టుకున్నా. వీడు తిరిగివచ్చి లైట్ వేయబోయే సమయంలో దారం లాగాను. స్విచ్ క్రిందికి దిగింది. "లూప్" జారిపోయి దారం నాచేతిలోకి వచ్చేసింది. అదే వాడి మొఖానికి తగిలి ఉంటుంది. ఆనల్లదారం వీడికి కనిపించలా, అందుకే ఆలైట్‌స్విచ్ దెయ్యం వేసిందన్నాడు." ఆపేసి అందరి మొహాల్లోకి చూసేడు దాసు.

"ఒరేయ్ ఇది నిజమేరా? నిజంగా వీడు చెప్పినట్టు జరిగిందంటావా?" అనుమానంగా కోదండం మొహంలోకి చూసేడు అబ్బా.

"పోనీ మళ్ళీచేసి చూపించరా" అన్నాడు కోదండం, అలాగే చేసేడు వాసు.

"ఆహా బలేవాడు. చూసిచూసి వీడితోనే వేళాకోళం ఆడాలి." భుజంమీద చరిచేడు కోదండం.

"ఊ. వీడు 'ఏంటీ దెయ్యమిక్ మెషిన్' గదరా మరి.", నవ్వుతూ అన్నాడు దాసు.

'అయితే ఇంతకీ ఈ కొంపలో దెయ్యాలున్నట్టా? లేనట్టా? ? ?" ప్రశ్నార్ధకంలో మొహం పెట్టేడు వాసు ★

